ప్లాంట్ ఏ ట్రీ మై ఫ్రెండ్స్



సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో పీఏటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న చిన్నారులు

కుత్బుల్లాపూర్: ప్లాంట్ ఏ ట్రీ మై ఫ్రెండ్స్ (పీఏటీ) ఆధ్వర్యంలో మంగళవారం సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో చిన్నారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పీఏటీ మెంబర్లు ఆరీవ్ కే రావ్, ఆరోహి నాయక్, శ్రీధా గౌడ్, అనన్యశివ్ మాట్లాడారు. నగర వ్యాప్తంగా అర్బన్ ఫారెస్ట్‌ను పెంపొందించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తమకు జీహెచ్ఎంసీ, హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్లు సహాయ సహకారాలు అందిస్తున్నాయని తెలిపారు. రోడ్ల పక్కన మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతకు కృషి చేస్తున్నామని అన్నారు. వచ్చే మూడు రోజుల్లో 100కు పైగా మొక్కలను నాటడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.

యథేచ్ఛగా రహదారుల ఆక్రమణలు..!

- రోడ్డుపైకి జరిగి మెట్లు, షెడ్ల ఏర్పాటు
- ప్రధాన రహదారుల్లో వ్యాపారాలతో ఇబ్బందులు
- నిత్యం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు తప్పని తిప్పలు
- జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల మధ్య కానరాని సమన్వయం





జగద్గిరిగుట్ట ప్రధాన రహదారిలో భారీగా ట్రాఫిక్ జామ్

ఆల్విన్‌కాలనీ: ప్రధాన రహదారుల్లో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు, ఇక సెల్లార్‌లు అద్దెకు ఇవ్వటంతో పార్కింగ్ స్థలం లేకపోవటంతో ప్రతి రోజూ ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ జగద్గిరిగుట్ట, ఉషాముళ్లపూడి రోడ్డు, ఆల్విన్‌కాలనీ, జయానగర్, గోవింద్ హోటల్ చౌరస్తా ప్రాంతాల్లో ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ట్రాఫిక్ అధికారులు పలుమార్లు ప్రధాన రహదారుల్లో అక్రమ నిర్మాణాలు, ఇళ్ల ముందు రేకుల షెడ్లు, రోడ్డు పక్కన మెట్లు ఏర్పాటు చేయవద్దని చర్యలు తీసుకున్నప్పటికీ జీహెచ్ఎంసీ అధికారుల అలసత్వం వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారు.

◆ దీనికి తోడు కరెంటు స్తంభాలు రోడ్డుపైనే ఏర్పాటు చేయటం, కరెంటు తీగలు కిందకు వేలాడటంతో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ట్రాఫిక్ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తే స్థానిక ప్రజాప్రతినిధుల అండతో తిరిగి తొలగించిన వాటిని యథాతథంగా ఏర్పాటు చేసుకుంటున్నారని వాహనదారులు వాపోతున్నారు. దీంతో సమస్య పునరావృతం అవుతోందని పేర్కొంటున్నారు.

◆ రహదారుల వెంట పార్కింగ్ చేయొద్దని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తే తాము వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలని దుకాణ సముదాయాలకు అనుమతులు ఇచ్చే ముందు చూడాలని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు జగద్గిరిగుట్ట ప్రధాన రహదారి నుంచి కూకట్‌పల్లి ఉషా ముళ్లపూడి వరకు అక్రమ నిర్మాణాలను తొలగించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీస్ సిబ్బందికి సహకరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



సామాన్లు కొనడానికి వచ్చే వారు వాహనాలను దుకాణం ముందు పార్కింగ్ చేస్తున్నారు. వెంటనే అక్కడకు ట్రాఫిక్ పోలీసులు వచ్చి నో-పార్కింగ్ అంటూ చలానాలు విధిస్తున్నారు. దుకాణ యజమానులు పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తే మేమెందుకు రోడ్డుపై పార్కింగ్ చేస్తామంటూ వాహనదారులు పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్నారు.

పరిష్కారం చూపాలి..



జగద్గిరిగుట్ట ప్రధాన రహదారిలో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు సతమతమవుతున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల పార్కింగ్‌కు స్థలం లేక రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులు సమన్వయంతో సమస్యకు పరిష్కారం చూపాలి. స్కూళ్లు, కళాశాలలు ప్రారంభమైతే ఈ రహదారిలో ప్రతి రోజు నరకం చూడాల్సి వస్తోంది.

– చిరుమర్తి రాజు, స్థానికుడు

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఆపన్న హస్తం



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ అడ్డగుట్టకి చెందిన వీరవెంకట అర్జున షణ్ముకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం ఇందుకు సంబంధించిన రూ.60వేల ఎల్‌ఓసీ పత్రాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తమని ఎమ్మెల్యే అన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న

హఫీజ్‌పేట్: వర్షాకాలం దృష్ట్యా మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ ముందు ఉన్న యూ టర్న్‌ను కూకట్‌పల్లి ఏసీపీ వెంకటయ్యతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆల్విన్ కాలనీ చౌరస్తా నుంచి సీఆర్ ఫౌండేషన్ వరకు ఉన్న యూ టర్న్‌ల వద్ద నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతేకాకుండా రోడ్డుపై ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించామన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు. రోడ్డుపై ఉన్న గుంతలకు తాత్కాలిక మరమ్మతులను కూడా చేయించామన్నారు.

ఉరేసుకొని గృహిణి ఆత్మహత్య



మృతి చెందిన రాణి

హఫీజ్‌పేట్: ఓ గృహిణి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైలంలోని సున్నిపెంటకు చెందిన కె.రాణి (34), ప్రకాశం జిల్లా మార్టూర్‌కు చెందిన కె.దినేష్‌కు 2008వ సంవత్సరంలో వివాహం జరిగింది. వీరు శేరిలింగంపల్లి పాపిరెడ్డి కాలనీలో నివాసముంటున్నారు. దినేష్ క్యాబ్ డ్రైవర్. వీరికి ముగ్గురు సంతానం కాగా ఇద్దరు అమ్మాయిలు ఒక అబ్బాయి ఉన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి దినేష్ అక్రమ సంబంధం పెట్టుకున్నాడని తనను నిత్యం వేధిస్తున్నాడని ఆమె తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు అతనిని మందలించారు. ఈ క్రమంలో కొన్ని నెలలు బాగానే ఉన్నాడు. మరలా తీరు మారకపోవడంతో రాణి గొడవకు దిగింది. ఎంత చెప్పిన భర్త వినడంలేదని సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఇంట్లో అందరు నిద్రపోయిన సమయంలో ఉరివేసుకొంది. ఆమె కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయడంతో రాణి తల్లిదండ్రులు వచ్చి చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆటోలో మరిచిపోయిన ల్యాప్‌టాప్ అప్పగింత

బంజారాహిల్స్: ఆటోలో మరిచిపోయిన ల్యాప్‌ట్యాప్‌ను పోలీసులు ట్రేస్ చేసి బాధిత సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని చెంతకు చేర్చారు. రమ్య అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలిసి జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడికి ఆటోలో వచ్చింది. అయితే ఆటోలోనే ల్యాప్‌ట్యాప్‌తో పాటు ఇతరత్రా తన వస్తువులు కలిగిన బ్యాగ్‌ను మరిచిపోయింది. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకురాగా సీసీ కెమెరాల ఆధారంగా ఆటోడ్రైవర్‌ను గుర్తించి బ్యాగ్‌ను రమ్యకు అప్పగించారు.

దోమల నివారణకు చర్యలు



నిజాంపేట్ కిందికుంట చెరువులో ఎంఎల్‌ఓ ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు సోమవారం నిజాంపేట్ కిందికుంట చెరువులో ఎంఎల్‌ఓ ఆయిల్ బాల్స్ వేసినట్లు ఎంటమాలజిస్ట్ సంధ్య తెలిపారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే దోమల వృద్ధి జరగదన్నారు. అందుకే ప్రతి ఇంట్లో నీరు ఎక్కువ రోజులు నిలవకుండా చూసుకోవాలన్నారు. ని, ప్రతి ఇంట్లో ప్లాస్టిక్ డ్రమ్ములు కాని, సిమెంట్ గోళాలు, నల్లా గుంతలు, పూల కుండీలు, టైర్లు, సంపులు, సింటెక్సును వారానికి ఒక్కసారైనా శుభ్రం చేసుకోవాలన్నారు. దోమ కాటు ద్వారా డెంగీ ఫీవర్, మలేరియా, చికూన్ గన్యా, మలేరియా, మెదడువాపు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు.

23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు

గచ్చిబౌలి: చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం తెలుగు రాష్ట్రాలలోనే అతి పెద్దది. మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం చేవెళ్లలో జరగనుంది. 23 రౌండ్లలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని అధికారులు తెలిపారు. శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 7,58,102 ఉండగా పురుషులు 4,00,361, మహిళలు 3,57,600, ఇతరులు 141 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లు 7,58,102 ఉండగా 3,33,181 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని మిగతా అసెంబ్లీ నియోజకవర్గాల ఓటింగ్ శాతంతో, గత ఎన్నికలతో పోల్చినా 43.91 శాతం తక్కువ ఓటింగ్ నమోదైంది.శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీలు, గేటెడ్ కమ్యూనిటీల ఓటర్లు ప్రభావం చూపే అవకాశం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ 54 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఒక వైపు మోదీ వేవ్‌తో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మరో వైపు రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిలకు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ పోటీ ఇస్తారా లేదా అనే అనే చర్చ కొనసాగుతోంది.

నేడు దాసాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

మోతీనగర్: కబీర్‌నగర్‌లోని శివరామాంజనేయస్వామి దేవాలయంలో 75 సంవత్సరాలకు పైగా పూజలు అందుకుంటున్న క్షేత్రపాలకుడు దాసాంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7.30 గంటలకు కార్యసిద్ధి కోసం తేనెతో అభిషేకం, 8.30 గంటలకు సంతానం, కల్యాణం, భార్యాభర్తల సఖ్యత కోసం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి పంచామృత అభిషేకం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.89770 77014.

10న భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా.హేమంత్ తెలిపారు. ఈనెల 10న ఉదయం 10గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లో రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉంటుందన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బిహెచ్ఈఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్, ఖాతాదారులు పాల్గొనవచ్చని అన్నారు.

వాటర్ ఫౌంటేన్ లేజర్ షో

మాదాపూర్: మాదాపూర్‌లోని దుర్గం చెరువులో ఏర్పాటు చేసిన లేజర్ వాటర్ ఫౌంటేన్ షో సందర్శకులను ఆకట్టుకుంటుంది. పాటలకు అనుగుణంగా వివిధ రంగులతో నిర్వహిస్తున్న షోను చూసేందుకు నగరంలోనే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తున్నారు. రోజు సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నిర్వహిస్తున్నారు. భారు దేశభక్తి పాటలకు షోలు నిర్వహిస్తున్నారు.

సీఎంకు సత్కారం

లిబర్టీ: రాష్ట్రాన్ని ప్రగతి పదం వైపు నడిపిస్తున్న తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానంద సత్కరించారు. సోమవారం ఆయనను కలిసి దళితుల ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినతపత్రం సమర్పించి ఆత్మీయ సత్కారం చేశారు. గడిచిన ఆరు నెలల కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రగతి పథకం వైపు తీసుకెళ్తుందని తెలిపారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

కుత్బుల్లాపూర్: కార్మికుల హక్కుల కోసం ఎంత వరకైనా పోరాడతానని ఐఎన్‌టీయూసీ నాయకుడు చింతల నాగరాజు అన్నారు. సోమవారం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని పలు కంపెనీల్లో పని చేస్తున్న కార్మికులు నాగరాజును ఆయన నివాసంలో కలిశారు. యాజమాన్యాలు తమకు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించడం లేదన్నారు. కనీస వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై నాగరాజు మాట్లాడుతూ.. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రమోద్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్మికులకు చట్టబద్ధంగా రావాల్సిన అన్ని సదుపాయలను పొందేందుకు యాజమాన్యాలతో చర్చిస్తానన్నారు. కార్మికులు వెంకటరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మి, రాము, అంజయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా రవిశంకర్‌రావు

కుత్బుల్లాపూర్: తెలంగాణ కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా బొడ్డు రవిశంకర్‌రావు ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో రాష్ట్రంలోని 43 కమ్మ సంఘాలు పాల్గొని ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షుడిగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఉండగా ఆయన స్థానంలో నూతనంగా రవిశంకర్‌ను ఎన్నుకున్నారు. సోమవారం సంఘం సభ్యులతో కలిసి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్, బండి రమేశ్, బిక్కసాని నాగేశ్వర్‌రావు, బొబ్బా రంగారావు, దిలీప్ చౌదరి, వెంకటేశ్వరరావు, గంగాధర్, బొడ్డు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సెంటర్ (ఎస్ఈఆర్‌సీ) ఆధ్వర్యంలో ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు 21వ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్(ఐసీఎస్ఏ)–2024 పేరిట సదస్సును నిర్వహిస్తారు.మంగళవారం నుంచి 8 తేదీ వరకు ఈ సదస్సు కొనసాగుతుంది. ఈ సదస్సుకు ట్రిపుల్‌ఐటీ ఎస్ఈఆర్‌సీ నుంచి డాక్టర్ వై రఘురెడ్డి, యూఎస్ఏలోని సదరన్ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ నెనాద్ మెద్విడోవిక్ అధ్యక్షత వహిస్తారు. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా 150 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటారు.

19న సదస్సు

పంజగుట్ట: సమతా ధ్యాత్మిక మూర్తి అన్నమయ్య జయంతి సందర్భంగా 'అందరికీ శ్రీహరే అంతరాత్మ' పుస్తకావిష్కరణ, ద్వేషం, అసమానత్వాలకి వ్యతిరేకంగా హిందూమతం అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీ విజయ శంకర స్వామి తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వాలిటీ అధ్యక్షుడు శ్రీ సాధు త్రినాథ దాస్, బిర్లా మందిర్ ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ఈ నెల 19వ తేదీన అన్నమయ్య జన్మదినం సందర్భంగా హైదరాబాద్ బిర్లా సైన్స్‌సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సామాజిక సేవలను విస్తృతం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక సేవలను మరింతగా విస్తృతం చేస్తూ పేద ప్రజల హితం కోసం పని చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షులు వి.నాగభూషణం అన్నారు. మాతావాకర్స్ క్లబ్ నల్లకుంట ఆధ్వర్యంలో వీఎస్టీ రోడ్డులో గత 54 రోజులుగా నిర్వహించిన ఉచిత మజ్జిగ, చలివేంద్రం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభూషణం మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం పని చేస్తున్న మాతావాకర్స్ క్లబ్‌ను స్ఫూర్తిగా తీసుకోని పని చేయాలని సూచించారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవలు అందిస్తున్న అధ్యక్షులు డాక్టర్ వై.మురళీధరుడిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

వరద నీటితో నిండిన లింగంపల్లి (ఆర్‌ఓబీ) రైల్వే అండర్ బ్రిడ్జి (ఫైల్)



వర్షాకాలం.. ఆర్‌ఓబీ.. నో ఎంట్రీ.!



చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద అండర్‌పాస్‌లో చేరిన వరదనీరు

చిన్నపాటి వర్షానికే నిండిపోతున్న అండర్‌పాస్‌లు ● వరదనీరు వెళ్లే వరకు రాకపోకలు బంద్

హఫీజ్‌పేట్: చిన్నపాటి వర్షం పడితే చాలు రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ)లను మూసివేస్తుండడంతో ట్రాఫిక్ కష్టాలు షురూ అవుతున్నాయి. వర్షాకాలం అండర్ బ్రిడ్జిల కింద భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని ఐటీ ఉద్యోగులు గచ్చిబౌలి వైపు వెళ్లాలంటే అండర్ బ్రిడ్జిల నుంచి వెళ్లాల్సి ఉంది. మియాపూర్, మదీనాగూడ, గంగారం, చందానగర్, లింగంపల్లి, బీహెచ్ఈఎల్, బీరంగూడ తదితర ప్రాంతాల ఐటీ ఉద్యోగులు లింగంపల్లి, పాపిరెడ్డి కాలనీ, వైశాలీనగర్‌ల అండర్ బ్రిడ్జి నుంచి వెళ్తుంటారు. అండర్ బ్రిడ్జి మూసివేసిన తరువాత ఓల్డ్ హఫీజ్‌పేట్, నల్లగండ్ల ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం లింకు రోడ్డు నిర్మాణం చేపట్టినా అసంపూర్తిగా మిగిలిపోయాయి. శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి మదీనాగూడలోని జీఎస్ఎం మాల్ వరకు లింక్ రోడ్డు నిర్మించాలని పనులు ప్రారంభించారు. అసంపూర్తిగా మిగిలిపోయాయి. వర్షాకాలం నేపథ్యంలో ముందుస్తుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఈ సంవత్సరం భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతున్న క్రమంలో ఎమ్మెల్యే గాంధీ అండర్ బ్రిడ్జి విస్తరణతో పాటు ఫ్లైఓవర్ గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.

◆ చందానగర్ హుడాకాలనీ నుంచి పాపిరెడ్డి కాలనీకి వెళ్లే అండర్‌పాస్‌ను చిన్నపాటి వర్షానికే మూసివేశారు.

◆ వైశాలీనగర్, పాపిరెడ్డి కాలనీ, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద రోడ్డు ఇరుకుగా ఉన్నాయి.

◆ బ్రిడ్జిల కింద ఒకవైపు రోడ్డు, మరో వైపు మురుగు నీటి కాలువ నిర్మించారు. దీంతో వర్షాకాలం రోడ్లు మూసివేతకు ప్రధాన కారణం

◆ ఇరుకు రోడ్లలోనే నాలాల ఏర్పాటుతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు.

◆ వర్షాలకు గుంతలుగా మారుతున్న అండర్‌పాస్‌లు

◆ లింకు రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో వాహనాలు అండర్ బ్రిడ్జి నుంచే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది

◆ వైశాలీనగర్, చందానగర్ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న అండర్‌పాస్‌లను ప్రణాళిక లేకుండా ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

◆ మియాపూర్ నుంచి లింగంపల్లి వరకు మూడు ఫ్లైఓవర్లు, నాలుగు అండర్ బ్రిడ్జిలు ఉన్నాయి. దానిలో రెండు రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్లు ఉండగా రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌కు సరిపోవడం లేదు. ఇక మూడు అండర్ పాస్‌లు ఇరుకుగా ఉన్నాయి.

రెండు ఫ్లైఓవర్లకు అనుమతులు వచ్చాయి



ఆర్టీసీ కాలనీ, లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు వచ్చాయి. ఫ్లైఓవర్ల నిర్మాణ ప్రణాళికలను సిద్ధం చేశాం. చందానగర్ రైల్వేస్టేషన్ వద్ద అండర్ పాస్ విస్తరణ చేయాలని అధికారులను ఆదేశించాం.

– ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్‌లో భారీగా వరద నీరు చేరడంతో బ్రిడ్జిని మూసి వేసిన దృశ్యం



అసంపూర్తిగా ఉన్న శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం నుంచి జీఎస్ఎం మాల్ లింక్ రోడ్డు పనులు



వైశాలీనగర్ రైల్వే అండర్ పాస్ వద్ద వరద నీరు చేరడంతో బారికేడ్లతో మూసివేసిన దృశ్యం (ఫైల్)

జల్సాలకు అలవాటుపడి బైక్ చోరీలు

హిమాయత్‌నగర్: జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తున్న ఓ వ్యక్తితో పాటు మైనర్‌ను నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుండి దొంగిలించిన ఒక ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. గత నెల 22న బర్కత్‌పురా ప్రాంతానికి చెందిన అర్కపల్లి శిథిరాజు తన ఇంటి ముందు పార్క్ చేసిన టీవీఎస్ బైక్ కనిపించడం లేదంటూ నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు, రాంకోఠి చౌరస్తాలో వాహన తనిఖీలలో అంబర్‌పేట్‌కు చెందిన సిమోన్ రాజ్, నాంపల్లికు చెందిన 17 ఏళ్ల మైనర్ బాలుడు దొంగతనానికి గురైన బైక్‌తో పట్టుపడ్డారు. వారిని విచారించగా ఆ బైక్‌ను దొంగలించినట్లు ఒప్పుకున్నారు. నిందితులు సిమోన్ రాజ్ వాల్ పెయింటింగ్, మైనర్ బాలుడు మెకానిక్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి వచ్చే డబ్బులు సరిపోక ఇలా దొంగతనాలు చేస్తూ , జల్సాలు చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. సిమోన్ రాజ్ గతంలో నారాయణగూడ , అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు కేసులలో నిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, బెయిల్ పై బయటకి వచ్చి ఇలా దొంగతనాలు చేస్తున్నట్లు ఏసీపీ శంకర్ తెలిపారు. వారి పై కేసు నమోదు చేసి సిమోన్ రాజ్‌ను రిమాండ్‌కు, మైనర్ బాలుడిని జ్యూవెనల్ హోమ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.